క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని ఇంజనీర్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఓబుల్‌రెడ్డి, లక్ష్మిరాజా, గుర్రప్ప, గోపాల్, లెనిన్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజాస్వామ్య, అభ్యుదయ, అంబేడ్కర్ వాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు


రిలే నిరాహార దీక్షలను చేస్తున్న న్యాయవాదులు

కడప అర్బన్: కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జీ.ఓ.నెం. 145ను రద్దు చేయాలని జిల్లా కోర్టు ఎదురుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. ఈ దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరుకున్నాయి. కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ దీక్షలలో పాల్గొన్న వారిలో పులికుంట ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఆర్. రామసుబ్బారెడ్డి, ఎం. వినయ్‌కుమార్, డి. రామాంజనేయులు, సి.వి. నరసింహారెడ్డి, ఎం. దేవ వినోద్, మహిళా న్యాయవాదులు ఏ. ఉమాదేవి, ఎస్. అనురాధ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

కడప కల్చరల్ : వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణ తెలిపారు. 15 ఏళ్లలోపు విద్యార్థులు జూనియర్స్‌గా, 30 ఏళ్లలోపు వయస్సుగల వారు సీనియర్లుగా పరిగణిస్తామన్నారు. జూనియర్లు స్వామి వివేకానందుని చిత్రం గీయాలని, సీనియర్లు ప్రకృతిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో జరగబోయే పరిణామాలపై చిత్రాలు గీయాల్సి ఉంటుందన్నారు. జనవరి 7న ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పోటీ ఉంటుందన్నారు. చిత్రలేఖనానికి అవసరమైన సామాగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలని, చిత్రం గీసేందుకు డ్రాయింగ్ షీటును నిర్వాహకులే అందజేస్తారన్నారు. విజేతలకు రూ. 5116, రూ. 3116, రూ. 2116 బహుమతిగా అందజేస్తామన్నారు. జనవరి 6వ తేదీ సాయంత్రంలోగా 88972 92237 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విగ్రహావిష్కరణ


వాజ్‌పేయి విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి

కడప అర్బన్: కడప నగరం ఎన్జీవో కాలనీలో బీజేవైఎం జాతీయ నాయకులు బత్తల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిలు హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాజ్‌పేయి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు బాలకృష్ణయాదవ్, లక్ష్మీనారాయణ రెడ్డి, బీరం విద్యా సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణమండపంలో బుధవారం దేవాంగ సంక్షేమ సంఘం, కల్యాణ మండపం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమసంఘం అధ్యక్షుడు వుట్టి నాగేశయనం మాట్లాడుతూ సంఘం, కల్యాణమండపం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా క్యాలెండర్లను రూపొందించి కులబాంధవులకు, మిత్రులకు పంపిణీ చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం శ్రీచౌడేశ్వరి దేవి అమ్మవారి కృపతో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం సెక్రటరీ గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి కాటం రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు వుట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు పోసా రామచంద్రుడు, క్యాలెండర్ కో ఆర్డినేటర్ గిద్దలూరు గంగాజలంధర్, కల్యాణమండపం శాశ్వత గౌరవాధ్యక్షుడు వుట్టి వీరయ్య, సందు శివనారాయణ, అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


కాల్యెండర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


సీబీటీ క్రైస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు


కాంగ్రిగేషనల్ టౌన్ చర్చికి భారతిసిమెంట్స్ ప్రతినిధులు అందజేసిన కేకును కట్ చేస్తున్న చర్చి కమిటీ ప్రతినిధులు


క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్టార్ వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

నగరంలో క్రిస్మస్ సందడి


ఆరోగ్యమాత చర్చిలో భక్తుల ప్రత్యేక ప్రార్థనలు


కాంగ్రిగేషనల్ చర్చిలో ప్రార్థనలు


ఆరోగ్యమాత చర్చిలో సందేశం ఇస్తున్న రెవరెండ్ ఫాదర్ పాపయ్య


కడప నగరంలో చర్చి ప్రాంగణంలో భక్తుల సందడి

కడప కల్చరల్ : కడప నగరంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పలు చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో స్థానిక క్రైస్తవ ప్రముఖులు నగర ప్రముఖులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

- స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని సీబీటీ క్రైస్ట్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు షఫీ, కె.బాబు, నాయకులు పులి సునీల్‌కుమార్, దాసరి శివ, షఫీ, రహీంలతో కలిసి కేక్ కట్ చేసి విశ్వాసులకు అందజేశారు.
- నగర మేయర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు. మేయర్ సురేష‌బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు కె.బాబు, మల్లికార్జున, శివకోటిరెడ్డి, షఫీ, అజంతుల్లా, నాయకులు యల్లారెడ్డి, దాసరి శివ, కృష్ణారెడ్డి, పవర్ అల్తాఫ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- స్థానిక ప్రకృతినగర్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ కేశవరెడ్డి, ఏజీఎం శ్రీదేవి క్రిస్మస్ విశిష్టతను తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నికృష్ణ, డీన్ ద్వారకనాథరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.
- స్థానిక సంధ్య సర్కిల్‌లో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు సెబాస్టియన్ క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేటరు మోత్కూరు సుబ్బరాయుడు, వెల్లాల రామకృష్ణారెడ్డి, రెడ్డిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్యాంసన్, వెన్సెంట్, ప్రముఖులు రహీం, మురళి, వినయ్, మహేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్యాలయంలో..

స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా సంస్థ సభ్యులు, క్రైస్తవ ప్రముఖులు దేవరాజ్, సత్యరాజ్‌లను ఘనంగా సత్కరించారు. సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతి సమాధానాల కర్త ఏసుక్రీస్తు

ప్రభువైన ఏసుక్రీస్తే శాంతి, సమాధానాల కర్త అని అంతర్జాతీయ ప్రసంగికులు డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం కడప నగరం రాజారెడ్డి వీధిలోని కృపా పరిచర్యలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని దైవ సందేశం అందజేశారు. ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి రక్షకుడిగా అవతరించారని చెప్పారు. బైబిల్‌లో కొన్ని వాక్యాలను ఆయన వివరించారు.

కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో..

స్థానిక కృపా కాలనీలోని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మల ఆధ్వర్యంలో క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. పాస్టర్ మహేష్ మాట్లాడుతూ సర్వపాపాల నుంచి మానవాళిని విముక్తి చేసేందుకే క్రీస్తు రక్షకుడిగా జన్మించాడన్నారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు నిర్మల, దివ్య తదితరులు పేదలకు చీరలను పంపిణీ చేశారు. చిన్నారులు క్రిస్మస్ దాత, దేవదూతల వేషాలతో ఆ కాలనీలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, అశోక్, రోజా, వెంకటేశ్, భరత్, లోకేష్, ఆశీర్వాదమ్మ, శ్రావణి, నరసయ్య, అందలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు వెలుగై ఉదయించాడు

కడప కల్చరల్ : ప్రపంచ మానవాళిని రక్షించేందుకే దేవుడు తన ప్రియ పుత్రుడైన ఏసుక్రీస్తు వెలుగును మానవ రూపంలో ఈ లోకంలో ఉదయింపజేశాడని పాస్టర్ విక్టర్‌రాజు అన్నారు. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. చెడును పూర్తిగా తరిమేసి నూతన సంవత్సరంలో ప్రేమ, కరుణ, సత్యం, న్యాయం, క్షమ, శాంతి గుణాలను అలవర్చుకోవాలని, కొత్త సంవత్సరానికి ఇదే మంచి కానుకగా అందించాలని సూచించారు. క్రీస్తును హృదయాలలో నింపుకునే అపూర్వ అవకాశం ఈ పండుగ ద్వారా లభిస్తోందన్నారు. మన సంతోషాన్ని ఇరుగుపొరుగులతో పంచుకున్నప్పుడే నిజమైన హ్యాపీ క్రిస్మస్ అని ఆయన అభివర్ణించాడు.

క్రైస్ట్ చర్చిలో...

కడప నగరంలోని క్రైస్ట్ చర్చిలో బుధవారం పాస్టర్ స్వరూప్ దైవ సందేశం అందించారు. మంచిని వెలుగుతో పోలుస్తారని, అందుకే దైవం నక్షత్ర రూపంలో లోకానికి క్రీస్తు రాకను తెలిపారన్నారు. మనలోని మంచిని మరింతగా పెంచేందుకు క్రీస్తు బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంధకారంలో ఉన్న మానవాళికి అశాంతిని దూరం చేసిన క్రీస్తు లోకమంతా వెలుగును పంచారని తెలిపారు.

కాంగ్రిగేషనల్ చర్చిలో..

నగరంలోని పాత రిమ్స్‌వద్దగల కాంగ్రిగేషనల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు జన్మదినం లోకానికి శుభోదయమని, ఆయన లోక రక్షణ కోసమే వచ్చారని తెలిపారు. శాంతి, సమాధానం, ఐక్యత ఆయన మార్గమని తెలిపారు. ఈ వేడుకల్లో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ప్రార్థనా మందిరం కమిటీ చైర్మన్ సంజీవరాయుడు, సెక్రటరీ విజేయుడు, ట్రెజరర్ నోవా బెన్ని, డీకెన్ కమిటీ సభ్యులు రాజా మనోహర్, ఆశీర్వాదమ్మ, ప్రసన్న, సుశీలమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు. భారతి సిమెంట్స్ అధికారులు అందజేసిన క్రిస్మస్ కేకును కమిటీ పెద్దలు, సభ్యులు, పాస్టర్ తదితరులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


క్రిస్మస్ వేడుకల్లో సందడి చేస్తున్న కేశవరెడ్డి చిన్నారులు


కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో కడప సియోనుపురానికి చెందిన కుటుంబ సభ్యులు


చర్చిలో కేక్ కట్ చేసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి, చర్చి కమిటీ సభ్యులు


చీరలను పంపిణీ చేస్తున్న పాస్టర్ మహేష్ తదితరులు

గోవిందా.. హరి గోవిందా..


పూజలు నిర్వహిస్తున్న వేద పండితుల బృందం


కార్యక్రమానికి హాజరైన భక్తులు

ఘనంగా ప్రారంభమైన శ్రీవారి పూజలు

కడప కల్చరల్ : గోవింద నామ స్మరణలు మార్మోగుతున్నాయి. ఆ లోగిలి భక్తజనంతో కిటకిటలాడింది. వేదిక, ప్రాంగణమంతా పసుపు ఆరబోసినట్లు కల్యాణ దాయకంగా కనిపించింది. గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన శ్రీవారి అభిషేకం, కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం వేదికపై పది అడుగుల ఎత్తున తిరుమలేశుని నిండైన విగ్రహం, ఆ ప్రాంగణానికి ప్రధాన ఆకర్షణగా కనిపించింది. ఆ పక్కనే శ్రీపద్మావతిదేవి కొలువై భక్తులను కటాక్షిస్తున్నట్లుగా ఉంది. ఈ రమ్యమైన ప్రాంగణంలో శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. గోవిందమాల దీక్షలో ఉన్న భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజలకు హాజరై కార్యక్రమానికి నిండుదనం చేకూర్చారు.

వేదోక్తంగా..

ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఉదయం సుప్రభాత, తోమాల సేవలు నిర్వహించి అర్చనలు చేశారు. గోవిందమాల భక్తులు తొలుత ఆ ప్రాంగణంలోని విఘ్న నాధుని వద్ద పూజలు నిర్వహించి కార్యక్రమానికి సంప్రదాయంగా సారెను మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వేదిక వద్దకు చేర్చారు. అనంతరం ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా అభిషేకం, అలంకారాలు నిర్వహించారు. మధ్యాహ్నం తిరుప్పావై, అష్టాదళ పాద పద్మారాధన నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. సాయంత్రం మంగళ స్నానం, అలంకారం, అనంతరం మహిళా భక్తులు ఆ ప్రాంగణంలో కుంకుమార్చన చేశారు. భక్తులే స్వామి, అమ్మవార్ల వైపు బంధుగణంగా దాదాపు రెండు గంటల సేపు ఎదుర్కోలు ఉత్సవాన్ని ఉత్సాహ, ఉల్లాస భరితంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు.

నేడు కల్యాణోత్సవం

ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు శ్రీనివాస కల్యాణం, సాయంత్రం 5 గంటలకు గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

బాబోయ్.. చలి..

పది రోజులుగా రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరిగి చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు చలికి గజగజ వణుకుతున్నారు. దానికితోడు పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో మబ్బులతో కూడి న వాతావరణం ఏర్పడడంతో వీచే చల్లని గాలుల వల్ల చలి తీవ్రత మరింత పెరిగింది. దీంతో ప్రజలు స్వెట్టర్లు, టోపీలు ధరించి బయటికి వస్తున్న దృశ్యాలు సాక్షి కెమెరా క్లిక్ అనిపించింది.

– మహమ్మద్ రఫీ
సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప







ఉర్దూ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉర్దూ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలను బలోపేతం చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్ ఇమామ్‌బాష, సయ్యద్ ఇక్బాల్‌బాషలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కడప వినాయక నగర్‌లోని సిటీ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో రూట 35 సంవత్సరాల విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. ఉర్దూ మీడియం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాష, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానిబాష మాట్లాడుతూ ఉర్దూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ముస్లిం సమైక్య వేదిక అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, టీడీపీ నాయకులు అప్సర్‌ఖాన్, మన్సూర్‌ఖాన్, ఖాజాపీర్‌ఖాన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు ముమహ్మద్ అలీ, రాష్ట్ర మైనార్టీ నాయకులు జమాల్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాష్‌బాష, రూట రాష్ట్ర నాయకులు హకీం, సిరాజ్, సత్తార్‌ఫైజీ, అసదుల్లా, ముజీబ్‌షాహి, నఖిఉల్లా, ముస్తాక్, ఖలందర్‌బాష, రఖీబ్, కలీం, అచార్యులు డాక్టర్ వసీవుల్లా, డాక్టర్ షాజియా, వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న రూట రాష్ట్ర అధ్యక్షుడు లయన్ ఇమామ్ బాషా